గుడిగుడికో జమ్మి చెట్టు!

- దసరాకు గ్రీన్ చాలెంజ్ కొత్త కార్యక్రమం
- పదివేలకుపైగా మొక్కల పంపిణీకి సిద్ధం
- స్వర్ణగిరిలో పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎంపీ సంతోష్‌కుమార్

స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో జమ్మి మొక్కను నాటి నీళ్లు పోస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్ సంతోష్ కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): దసరా పండగ సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ (జీఐసీ) మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నది. తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మిని ప్రతి ఊరిలో, ప్రతి గుడిలో నాటించాలన్న సంకల్పం తీసుకున్నది. దసరా పండుగనాడు లాంఛనంగా జమ్మి మొక్కలను నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను స్వర్ణగిరి అలయ పూజారి చేతుల మీదుగా రాజ్యసభ మాజీ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో జమ్మి మొక్కను నాటారు. వేద కాలం నుంచి భక్తిపూర్వకంగా అందరూ పూజించుకునే జమ్మిచెట్టును తెలంగాణ రాష్ట్ర వృక్షంగా నాటి కేసీఆర్ ప్రభుత్వం గుర్తించింది. అయితే, అనేక కారణాలతో జమిచెట్టు అంతరించిపోతున్న నేపథ్యంలో దాని విశిష్టత రీత్యా ప్రతి ఊరిలో, ప్రతి గుడిలో పెంచాలన్న లక్ష్యంతో గ్రీన్ ఇండియా చాలెంజ్ తరపున ఊరు ఊరుకో జమ్మి చెట్టు– గుడిగుడికో జమ్మి చెట్టు నినాదాన్ని సంతోష్‌కుమార్ తీసుకున్నారు.

జమ్మిని పూజించడం ఆచారం: సంతోష్

తెలంగాణలో దసరానాడు జమ్మిచెట్టును పూజించడం ఆచారమని, జమ్మి ఆకులను బంధుమిత్రులకు ఇచ్చిపుచ్చుకుని అందరికీ మంచి జరగాలని కోరుకోవడం ఆనవాయితీ అని సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రాధాన్యం దృష్ట్యా రానున్న దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఊరుఊరుకో జమ్మిచెట్టు–గుడిగుడికో జమ్మి చెట్టు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే పదివేల కుపైగా జమ్మి మొక్కలను సిద్ధం చేస్తున్నామని, అన్ని గ్రామాలు, గుడులకు వీటిని పంపిణీ చేస్తామని చెప్పారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కోఫౌండర్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వేద కాలం నుంచి నిత్య జీవితంలో భాగమైన జమ్మిని ప్రతి ఊరిలో, గుడిలో, బడిలో పెంచాలన్న గొప్ప ఆలోచన చేసిన సంతోష్‌కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,పొన్నం ప్రభాకర్‌గౌడ్, జూపల్లికృష్ణారావు, సీతక్క

త్యాగజీవి కొండా లక్ష్మణ్ బాపూజీ

- స్వరాష్ట్రం కోసం పరితపించిన నేత కొండా లక్ష్మణ్ బాపూజీ
- మంత్రిపదవినే వదులుకున్న మహనీయుడు
- మంత్రులు పొన్నం, తుమ్మల, జూపల్లి, సీతక్క
- రవీంద్రభారతిలో బాపూజీ 109వ జయంతి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 27: నమ్మిన సిద్ధాంతం కోసం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జీవితాన్నే త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం తెలంగాణ సమాజానికి ఆదర్శనీయమని రాష్ట్ర మంత్రులు కొనియాడారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, జూపల్లి కృష్ణారావు, సీతక్క మాట్లాడారు. తొలుత బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుపెట్టి గౌరవించిందని మంత్రులు తెలిపారు. చేనేత కార్మికుల ఉపాధి కల్పనకు అనేక రకాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వస్త్రాల మీద జీఎస్టీ విధించడాన్ని వ్యతిరేకిస్తూ బాపూజీ స్ఫూర్తితో పద్మశాలీలంతా ఐక్యపోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం కోసం మంత్రి పదవినే వదులుకున్న త్యాగజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, టీజీఎండీసీ చైర్మన్ అనిల్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, బీసీ కమిషన్ సభ్యుడు సురేందర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ మాయాదేవి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగంట్ల స్వామి, వైస్ చైర్మన్ అవ్వారి భాస్కర్ పాల్గొన్నారు.

నేతన్నలకు రుణమాఫీ లేనట్టే!

- బాపూజీ జయంతికి హాజరే కాని సీఎం
- లక్ష మంది కార్మికులకు మొండిచెయ్యి

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి మొండిచెయ్యి చూపింది. ఇప్పటికే బతుకమ్మ చీరల తయారీని నిలిపివేసిన ప్రభుత్వం నేతన్నల కడుపు కొట్టింది. రాష్ట్రంలోని లక్ష మంది నేతన్నలకు రుణమాఫీ చేస్తామన్న హామీని కూడా తుంగలో తొక్కిందని చేనేత కార్మికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. శుక్రవారం రవీంద్రభారతి వేదికగా అధికారికంగా నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి డుమ్మా కొట్టారు. కేవలం మంత్రులు పొన్నం, జూపల్లి, తుమ్మల, సీతక్క హాజరయ్యారు. ఎలాంటి ప్రకటన చేయకుండానే జయంతి ఉత్సవాలను ముగించడం విమర్శలకు దారితీసింది. సీఎం వచ్చి రుణమాఫీ, ఇతర సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటారని అనుకున్న చేనేత కార్మికులకు నిరాశే ఎదురైంది. దీంతో నేత కార్మికులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా త్వరలోనే నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు చేనేత సంఘాల నాయకులు సిద్ధంగా ఉన్నారు.

తుమ్మిడిహట్టికి మహారాష్ట్ర ఒప్పుకోలే

- బరాజ్ ఎఫ్ఆర్ఎల్‌ను మార్చాలన్నది
- ఆ తరువాతనే కాళేశ్వరం రీడిజైన్ చేశాం
- కాళేశ్వరం ప్రాజెక్టు ఆస్తులన్నీ కార్పొరేషన్‌వే
- కమిషన్ ఎదుట ఈఎన్సీ, కేఐపీసీఎల్ ఎండీ హరిరాం

హైదరాబాద్, సెప్టెంబర్27 (నమస్తే తెలంగాణ): ముంపు నేపథ్యంలో తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర సర్కారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసిందని గజ్వేల్ ఈఎన్సీ, కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీ హరిరాం వెల్లడించారు. ఎఫ్ఆర్ఎల్‌ను 152 మీటర్ల నుంచి 148కి తగ్గించాలని కోరడంతో ప్రాజెక్టునే మరోసారి పునఃసమీక్షించాలని కోరిందని, అందుకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని వివరించారు. ఉన్నతస్థాయి సమావేశాల అనంతరం ప్రాజెక్టు రీడిజైన్ చేశారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటైన జస్టిస్ ఘోష్ కమిషన్ శుక్రవారం నిర్వహించిన బహిరంగ విచారణకు హరిరాం హాజరయ్యారు. ప్రాజెక్టు రూపకల్పన, కార్పొరేషన్ ఏర్పాటు, బ్యాంకుల నుంచి రుణాల సేకరణ, బిల్లుల చెల్లింపు అంశాలపై జస్టిస్ ఘోష్ అడిగిన ప్రశ్నలకు సూటిగా, స్పష్టంగా సమాధానాలు ఇచ్చారు. 2.30 గంటలపాటు విచారణ కొనసాగగా, 90కిపైగా ప్రశ్నలు అడిగారు. ప్రాజెక్టు రూపకల్పనకు సంబంధించిన అంశాలను హరిరాం వివరించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుపై 2015 ఫిబ్రవరిలో మహారాష్ట్ర, తెలంగాణ సీఎంల మధ్య అత్యున్నతస్థాయి సమావేశం కొనసాగిందని వివరించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బరాజ్‌ను నిర్మిస్తే 3,700 ఎకరాలకు ముంపు సమస్య ఉన్నదని, ఎత్తును 148కి తగ్గించాలని మహారాష్ట్ర సీఎం, తెలంగాణ సీఎంను కోరారని, మొత్తం ప్రాజెక్టునే మరోసారి సమీక్షించాలని విజ్ఞప్తి చేశారని వెల్లడించారు. దీంతో తెలంగాణ సర్కారు అనేక చర్చలు కొనసాగించి, ఆ తరువాత ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చారని కమిషన్‌కు వివరించారు.

రుణాల్లో 10 వేల కోట్లు పీఆర్ఎల్ఐఎస్‌కు

కాళేశ్వరం ప్రాజెక్టును వేగంగా నిర్మించేందుకు, అవసరమైన నిధులకు కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసిందని హరిరాం తెలిపారు. ప్రభుత్వ గ్యారెంటీలతోనే రుణాలను సేకరించామని, నిబంధనల మేరకే బిల్లుల చెల్లింపు కొనసాగిందని వివరించారు. కార్పొరేషన్ ఆర్థిక వ్యయాల మదింపునకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఇంటర్నల్ ఆడిటర్‌ను నియమించిందని, కాగ్ సైతం ఆర్థిక సంవత్సరం వారీగా ఆడిటర్లను నియమిస్తూ మదింపు చేయిస్తున్నదని వెల్లడించారు. ఇప్పటివరకు వడ్డీతో కలిపి రూ.87,449 కోట్ల రుణం మంజూరైందని తెలిపారు. వాటిలో బ్యాంకుల నుంచి రూ.64 వేల కోట్లు విడుదల కాగా, ఏజెన్సీలకు చెల్లింపులు చేశామని వివరించారు. రూ.29,737 కోట్లు రీ పేమెంట్ చేశామని తెలిపారు. కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా రుణం నుంచే రూ.10వేల కోట్లను పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (పీఆర్ఎల్ఐఎస్) నిర్మాణ పనుల కోసం వెచ్చించామని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం కార్పొరేషన్ బ్యాలెన్స్‌షీట్, వార్షిక నివేదికలు, ఆడిట్ రిపోర్టులు, వర్క్‌బిల్లను అందజేయాలని ఈఎన్సీ హరిరాంకు కమిషన్ సూచించింది. శనివారం కూడా విచారణ కొనసాగుతుంది.

మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- గిరాకీ లేక, ఈఎంఐ కట్టలేక..
- మేడ్చల్ జిల్లాలో ఘటన

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'మహాలక్ష్మి' పథకంతో ఉపాధి కరువై.. బతుకు భారమై మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా మల్లాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. మల్లాపూర్‌లో నివాసముండే పత్లావత్ వీరేశ్(31) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రభుత్వ నిర్వాకంతో ఆటో గిరాకీ తగ్గి ఆర్థిక సమస్యలు తలెత్తాయి. కాగా శుక్రవారం వీరేశ్‌ను ఫైనాన్స్ డబ్బులు ఎప్పుడిస్తావంటూ కొంతమంది దుర్భాషలాడారు. దీనికితోడు పిల్లల ఫీజులు కట్టలేకపోయానని కలతచెందిన వీరేశ్ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇప్పటివరకు 60 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యకు పాల్పడ్డారని బీఆర్‌టీయూ నాయకులు వాపోయారు.

రాష్ట్రంలో దొంగలు పడ్డారు!

- తెలంగాణలో అంతర్రాష్ట్ర దొంగల హల్‌చల్
- సాక్షాత్తూ డిప్యూటీ సీఎం భట్టి ఇంట్లోనే చోరీ
- హైదరాబాద్ శివార్లలో రెచ్చిపోతున్న ముఠాలు
- జిల్లాలకు విస్తరించిన చైన్‌స్నాచింగ్ ఘటనలు
- కరువైన పోలీస్ నిఘా.. బిక్కుబిక్కుమంటున్న జనం

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో దొంగలుపడ్డారు. ఎక్కడికక్కడ దోచేస్తున్నారు. ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మరీ ముఖ్యంగా హైదరాబాద్ నగరంతోపాటు సమీప జిల్లాల్లో దొంగల ముఠాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. చైన్‌స్నాచింగ్ ఘటనలు అన్ని జిల్లాల్లో చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణలో తిష్టవేసిన పార్తీ గ్యాంగ్‌లు, థార్ గ్యాంగ్‌లు, బిహారీ దొంగల ముఠాలు పేట్రేగిపోతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి అడ్డగోలుగా దొంగతనాలు చేస్తున్నారు. ఏకంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో చొరపడి విలువైన నగదు, నగలు, విదేశీ కరెన్సీ తదితర సామగ్రిని దోచుకున్న ఘటన మరింత భయాందోళన కలిగిస్తున్నది. మళ్లీ వరసగా చైన్‌స్నాచింగ్, దొంగతనాలు జరుగుతుండటం ఆందోళనకరం. నగర శివార్లలోని సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవడంతోపాటు ఎక్కువ మొత్తంలో నగలను కొల్లగొట్టేందుకు జిల్లాలకు విస్తరించాయి. గత మూడు నెలల్లో ఖమ్మం జిల్లా పెనుబల్లిలో, నిజామాబాద్ జిల్లా మామిడిపల్లి, మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్, పోచారంలో, వరంగల్ జిల్లా చిల్పూర్‌లో, హైదరాబాద్ నగర శివారులోని మరో రెండు చోట్ల చైన్‌స్నాచింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. విద్యుత్ మోటర్లు ఎత్తుకెళ్లే ముఠాలు, రాగి వైరు దొంగలు, బైక్‌ల దొంగలు, కార్ల దొంగలు రెచ్చిపోతున్నారు. గత ఆరు నెలలుగా దొంగతనాలు, చోరీల్లో నల్లగొండ జిల్లా అగ్రస్థానంలో ఉన్నది. పోలీసులు పార్థీగ్యాంగ్‌ను ఎట్టకేలకు అరెస్టు చేయడంతో అక్కడ కొద్దిగా దొంగతనాల బెడద తగ్గింది. ఇటీవల మళ్లీ దొంగలు చెలరేగిపోతున్నారని స్థానికులు అంటున్నారు. సెల్ షాపులు, మూసి ఉన్న దుకాణాలు, ఇండ్లు టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నారు. హైదరాబాద్ సహా సమీప జిల్లాల్లో థార్ గ్యాంగ్‌లు, పార్థీ గ్యాంగ్‌లు, భవారీయా ముఠాలు, చుడీదార్ గ్యాంగులు, రైళ్లలో దొంగతనం చేసే ముఠాలు, ఫోన్లు అపహరించే ముఠాలు, కిరాయి హత్యలు చేసే మూకలు, చిన్నారులను అపహరించే గ్యాంగులు రాష్ట్రంలో తిష్టవేసినట్టు పోలీసులే చెబుతున్నారు. కానీ, వారిని అరెస్టు చేయడంలో, తెలంగాణ వైపు కన్నెత్తి చూడకుండా చేయడంలోనూ ఎలాంటి పటిష్ట చర్యలు తీసుకోలేకపోతున్నారు.

డిప్యూటీ సీఎం ఇంట్లో చోరీ

మొదటిపేజీ తరువాయి...

చోరీకి పాల్పడ్డాడు. అనంతరం ఇద్దరు పశ్చిమబెంగాల్‌కు పారిపోయారు. ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో భట్టి ఇంట్లో దొంగతనం బయటపడింది. నిందితుల వద్ద రూ.2.2 లక్షల నగదు, వంద గ్రాముల బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని బంజారాహిల్స్ పోలీసులకు సమాచారమిచ్చారు. నిందితులను హైదరాబాద్‌కు తీసుకొచ్చే అవకాశమున్నది.

అటవీశాఖ అధికారులపై దాడి

- జేసీబీని స్వాధీనానికి యత్నించగా ఘటన
- వరంగల్‌లో చికిత్స పొందుతున్న సిబ్బంది
- దాడిని ఖండించిన మంత్రులు సురేఖ, సీతక్క

దాడిలో తీవ్రంగా గాయపడిన అటవీ శాఖ అధికారి

ములుగు, సెప్టెంబర్ 27 (నమస్తేతెలంగాణ)/తాడ్వాయి/వరంగల్: రిజర్వు ఫారెస్టులో పోడు చేస్తున్నారనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లి జేసీబీని స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులపై కొందరు దాడికి తెగబడ్డారు. ములుగు జిల్లా తాడ్వాయి రేంజ్ పరిధిలోని దామరవాయి గ్రామ శివారులో పోడు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎఫ్ఎస్‌వో వినోద్‌కుమార్, ఎఫ్‌బీవోలు శరత్‌చంద్ర, సుమన్, బేస్ క్యాపు సిబ్బంది ఎట్టి శ్రీను, జీపు డ్రైవర్ రాజేందర్ గురువారం రాత్రి పెట్రోలింగ్‌కు వెళ్లారు. తాడ్వాయి వైపు వస్తున్న జేసీబీని ఆపి ఎక్కడికి వెళ్లి వస్తున్నారంటూ ప్రశ్నించారు. పోడు చేసి వస్తున్నారని గుర్తించి జేసీబీని స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించేందుకు యత్నించారు. ఆగ్రహించిన జేసీబీ యజమాని గంట సూరజ్‌రెడ్డి, ఆపరేటర్ నీరటి శ్రీకాంత్, గంట శశిధర్, పాండవుల సాయికుమార్, మ్యాదరి చంటి కలిసి దాడి చేయడంతో ఎఫ్ఎస్‌వో వినోద్‌కుమార్, ఎఫ్‌బీలు శరత్‌చంద్ర, సుమన్ తల, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడికి పాల్పడిన సూరజ్‌రెడ్డి, శశిధర్, చింటు, సాయి, శ్రీకాంత్‌ను శుక్రవారం కాటాపూర్ క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్టు ఎస్సీ శబరీష్ తెలిపారు. కాగా రెవెన్యూ భూమిలో పైప్‌లైన్ కందకాలు తీసేందుకు వెళ్లి రాత్రి 11 గంటలకు తిరిగి వస్తుండగా అటవీ అధికారులు బూతులు తిడుతూ తన తమ్ముడు శశిధర్‌పై బండరాయితో తలపై కొట్టడంతో రక్తస్రావమైందని, దీంతో తాము దాడి చేశామని సూరజ్‌రెడ్డి తెలిపారు. అధికారులపై దాడిని మంత్రులు సురేఖ, సీతక్క, కలెక్టర్ టీఎస్ దివాకర, ఆదివాసీ సంఘాల నాయకులు ఖండించారు. శుక్రవారం మంత్రి సురేఖ దవాఖానకు వెళ్లి వారిని పరామర్శించారు.

మరో 2 వేల కోట్ల అప్పుకు బాండ్లు

మొదటిపేజీ తరువాయి...

చేరనున్నది. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు అధికారం చేపట్టిన నాటినుంచి ఇప్పటివరకు రూ.71,495 కోట్ల అప్పు చేసింది. వచ్చే రూ.2,000 కోట్లతో కలిసి రాష్ట్ర రుణం రూ.73,495 కోట్లకు చేరుతుంది. ఈ నెల 3న రూ.2,500 కోట్లు, 10న 1,500 కోట్లు, 17న రూ.500 కోట్లు.. ఇలా నెల వ్యవధిలోనే రూ.4,500 కోట్ల రుణం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అక్టోబర్ 1న మరో రూ.2,000 కోట్ల అప్పు తీసుకోనున్నది. ప్రతి నెలా రూ.5 వేల కోట్ల నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్ల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి అప్పులు తీసుకుంటున్నది.

దాతల సహకారంతోనే బ్రేక్‌ఫాస్ట్ స్కీం

- సీఎం నియోజకవర్గం కొడంగల్‌లో పైలట్‌ప్రాజెక్ట్‌గా అమలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): సర్కారు బడుల్లోని విద్యార్థుల ఆకలి తీర్చేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని నీరుగార్చిన ప్రస్తుత ప్రభుత్వం ఇదే పథకానికి కొత్త రంగులద్దింది. మళ్లీ తిరిగి ప్రారంభించనుండగా, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలుచేయాలని నిర్ణయించింది. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా బ్రేక్‌ఫాస్ట్ స్కీంను అమలుచేయనున్నారు. నియోజకవర్గంలోని 312 పాఠశాలల్లోని 28 వేల మంది పిల్లలకు అల్పాహారాన్ని అందజేసేందుకు వయాట్రిక్ ఫార్మా సంస్థ ముందుకొచ్చింది. సీఎస్సార్ నిధుల నుంచి రూ.6.4కోట్లను విరాళంగా అందజేసింది. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో రెండు సంస్థల మధ్య ఎంవోయూ కుదిరింది. దాతల సహకారంతో బ్రేక్‌ఫాస్ట్ స్కీంను అమలుచేసే అంశాన్ని ఇటీవలే 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకొచ్చింది. 'దాతలు దయతలిస్తేనే బ్రేక్‌ఫాస్ట్' శీర్షికతో 22న కథనాన్ని ప్రచురించింది.

ఎలక్ట్రికల్ బస్సులకు 10 కొత్త డిపోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రికల్ బస్సుల కోసం నూతనంగా పది డిపోలు అవసరమని ప్రభుత్వానికి ఆర్టీసీ ప్రతిపాదనలు చేసింది. ఒక్కో డిపోకు రూ.10 కోట్ల చొప్పున రూ.100 కోట్లు.. ఒక్కో డిపోకు 10 ఎకరాల చొప్పున 100 ఎకరాలు కావాలని ప్రభుత్వాన్ని కోరింది. ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ కోసం 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ సరఫరా అవసరమని ఆర్టీసీ భావిస్తున్నది. ఇతగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నది.

సంక్షోభంలోకి తెలంగాణ విద్యారంగం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ విద్యార్థి మహాగర్జన ధర్నా
- విద్యార్థులపై పోలీస్ జులుం.. నేడు నిరసనలకు ఎస్ఎఫ్ఐ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రాష్ట్రంలోని విద్యారంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో ప్రవేశంతో మొదలు సీటు, ఫీజులు, డొనేషన్లు, పాఠ్య పుస్తకాలు, హాస్టల్ వసతులు, అధ్యాపకుల కొరతతో విద్యారంగంలో సంక్షోభం నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ 8 నెలల కాలంలో విద్యారంగంలో నెలకొన్న ఏఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచలేదని విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద చేపట్టిన ఎస్ఎఫ్ఐ విద్యార్థి మహాగర్జన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 1,864 ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మహాగర్జన తరలివచ్చిన విద్యార్థులను పోలీసులు ఈడ్చుకెళ్లి అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు టీ నాగరాజు, కార్యదర్శి ఆర్ ఎల్ మూర్తి తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా శనివారం రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నట్టు ప్రకటించారు.

జీవో 46 బాధితుల గాంధీభవన్ ముట్టడి

- కాంగ్రెస్ నట్టేట ముంచిందని ఆగ్రహం
- ఉత్తమ్‌ను నిలదీసిన బాధితులు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): సమస్యను వెంటనే పరిష్కరించాలని జీవో 46 బాధితులు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌ను ముట్టడించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాడు కాంగ్రెస్ నేతలు ఆందోళనలకు పిలుపునిచ్చిన పోస్టర్లనే ప్లకార్డులుగా చేతబూని గాంధీభవన్ మెట్లపై కూర్చొ ని నినాదాలు చేశారు. శుక్రవారం గాంధీభవన్‌కు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని వారు ఘెరావ్ చేశారు. జీవో 46ను తక్షణం రద్దు చేయాలని, ఇక్కడే ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఉన్న 2 వేల కానిస్టేబుల్ పోస్టుల ఖాళీలను తమతో భర్తీచేయాలని, మరో 1,000 సూపర్ న్యూమరరీ పోస్టులను భర్తీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'మీ సమస్యపై ముఖ్యమంత్రితో మాట్లాడి చెప్తాను. ఎన్నికల్లో జీవో 46ను రద్దు చేస్తామని మీకిచ్చిన హామీ మాట వాస్తవమే. దీనికి కొంత సమయం పడుతుంది' అని మంత్రి ఉత్తమ్ వారితో చెప్పారు. త్వరలోనే న్యాయం చేస్తామని బాధితులకు చెప్పి వెళ్లిపోయారు.

ఏసీబీకి పట్టుబడిన హుస్సేన్, రవీందర్,ప్రభుదాస్, షకీల్

ఏసీబీకి చిక్కిన నలుగురు అధికారులు

- జనగామలో ఆర్‌అండ్‌బీ ఈఈ, ఏటీవో
- సరూర్‌నగర్‌లో వీఎం హోం ప్రిన్సిపల్
- సంగారెడ్డి జిల్లాలో పంచాయతీ కార్యదర్శి

జనగామ చౌరస్తా/ఆర్కేపురం/కొండాపూర్, సెప్టెంబర్ 27: వేర్వేరు చోట్ల లంచం తీసుకుంటూ శుక్రవారం నలుగురు అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. జనగామలో ఆర్‌అండ్‌బీ ఈఈ, ఏటీవో, సరూర్‌నగర్‌లో వీఎం హోం ప్రిన్సిపల్ సంగారెడ్డి జిల్లాలో పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు దొరికారు. వివరాలు ఇలా.. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం బండ్లగూడెంకు చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్ చిర్ర సత్యపాల్‌రెడ్డి భార్యకు లింగాలఘనపురంలో హిందూస్థాన్ పెట్రోలియం బంక్ మంజూరైంది. దాని స్థాపనకు అవసరమయ్యే ఎన్‌వోసీ కోసం వరంగల్ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోగా, రిమార్క్స్ పరిశీలన కోసం జనగామ ఆర్‌అండ్‌బీ ఈఈ, డీపీవో, ఏసీపీకి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈఈ చిలుకపాటి హుస్సేన్ ఎన్‌వోసీ జారీ చేయడానికి సత్యపాల్‌రెడ్డిని 14 వేలు లంచం డిమాండ్ చేయగా ఏసీబీని సంప్రదించారు. శుక్రవారం జనగామ కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ ఈఈ హుస్సేన్ సత్యపాల్‌రెడ్డి నుంచి రూ.12 వేలు తీసుకొని మరో రూ.2 వేలను ఏటీవో రవీందర్‌కు ఇప్పించాడు. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

29వేలు తీసుకుంటూ 'వీఎం' ప్రిన్సిపల్

గ్రేటర్ హై